క్లుప్తంగా

విద్యార్థులు ఉన్నతంగా ఎదగాలి



సమావేశంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): విద్యార్థులు జీవితంలో లక్ష్యాలు ఎంచుకొని ఉన్నత స్థితికి చేరుకోవాలని పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి.గణపతిరెడ్డి అన్నారు. హాజీపూర్ మండలంలోని ముల్కల్ల జెడ్పీ పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులకు 9వ తరగతి విద్యార్థులు ఆత్మీయ వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు ప్యాడ్‌లు, పెన్నులు, పెన్సిల్, స్కేళ్లను అందించారు. విద్యార్థులు ప్రదర్శించిన ఆటపాట కార్యక్రమం అందరినీ అలరించాయి. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాజశేఖర్, బన్న రవీందర్, సబిత, అంజయ్య, జగన్మోహన్‌రావు, శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

'పది' విద్యార్థులకు వీడ్కోలు



మాట్లాడుతున్న ఎంఈవో రాధాకృష్ణమూర్తి

భీమారం: పది విద్యార్థులు నిర్భయంగా పరీక్షలు రాయాలని ఏఈవో రాధాకృష్ణమూర్తి కోరారు. మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం పదో తరగతి విద్యార్థులకు తొమ్మిదో తరగతి విద్యార్థులు వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కష్టపడి చదవకుండా, ఇష్టపడి చదవాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల హెడ్మాస్టర్ విక్రమ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ముత్యాల పోచమ్మ విగ్రహ ప్రతిష్ఠ



పాల్గొన్న జెడ్పీ చైర్‌పర్సన్ భాగ్యలక్ష్మి

మందమర్రిరూరల్: మందమర్రి పట్టణంలోని మూడో జోన్‌లో పునఃనిర్మాణం చేసిన ముత్యాల పోచమ్మ ఆలయంలో బుధవారం విగ్రహ ప్రతిష్ఠ చేశారు. ఈ కార్యక్రమానికి జెడ్పీ చైర్‌పర్సన్ నల్లాల భాగ్యలక్ష్మి, మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదెలుతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల నాయకులు, పట్టణ ప్రజలు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం తనిఖీ



భోజనం పరిశీలిస్తున్న ఎంపీడీవో రాధ

భీమారం: మండలంలోని కాజిపల్లి, బూర్గుపల్లి గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని బుధవారం ఎంపీడీవో రాధ తనిఖీలు చేశారు. ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన భోజనం అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుందని, ఈ మేరకు విద్యార్థులకు అందేలా చూడాలని ఉపాధ్యాయులను ఆమె ఆదేశించారు. పాఠశాల ఆవరణలో మునిగ చెట్లు పెంచాలని సూచించారు. కాగా కాజిపల్లి, బూర్గుపల్లిలోని హరితహారం నర్సరీలను సందర్శించారు. వేసవి ఎండల నుంచి మొక్కలను కాపాడేందుకు గ్రీన్‌షెడ్ నెట్‌లను ఏర్పాటు చేయాలని కార్యదర్శులను ఆదేశించారు. ఇందులో ఎంపీవో సతీష్ రెడ్డితో పాటు కార్యదర్శులు ఉన్నారు.

ఉద్యోగ నియామకపత్రాలు అందజేత



నియామక పత్రాలతో ఉద్యోగులు

మందమర్రిరూరల్: మందమర్రి ఏరియాలోని జీఎం ఆఫీస్ ఆవరణలో బుధవారం 11మంది ఏరియా జీఎం మనోహర్ కారుణ్య ఉద్యోగ నియామకపత్రాలు అందించారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ.. సింగరేణిలో ఉద్యోగం లభించడం అదృష్టంగా భావించి గైర్హాజరు లేకుండా సంస్థ నిర్దేశించిన బొగ్గు ఉత్పత్తి లక్ష్య సాధనకు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏరియా పర్సనల్ మేనేజర్ సల్ల శ్యాంసుందర్, అధికారులు గుర్తింపు సంఘం నాయకులు ఉన్నారు.

షాదీఖానా.. భూ వివాదం..!

- ఖాళీ భూమి ఆక్రమణ
- తప్పుడు పత్రాల సృష్టి
- దొడ్డిదారిన ఇంటి నంబర్ల జారీ



షంషీర్ నగర్‌లోని షాదీఖానా భవనం

బెల్లంపల్లి: మున్సిపాలిటీ పరిధి షంషీర్‌నగర్‌లోని షాదీఖానా భూ వివాదం రగులుతోంది. ఓ వర్గం షాదీఖానాకు చెందిన భూమికి సంబంధించి రెవెన్యూ దస్త్రాలు సృష్టించి కబ్జాకు పాల్పడ్డారనే విమర్శలు ఉన్నాయి. ప్రస్తుతం ఖాళీ స్థలాలకు విపరీతమైన డిమాండ్ ఉండటం, గుంట భూమికి రూ.లక్షల చొప్పున ధర పలుకుతుండటంతో అక్రమార్కుల కన్ను షాదీఖానా భూమిపై పడినట్లుగా తెలుస్తోంది. షాదీఖానా భూమి హద్దులను చెరిపేసి తప్పుడు మార్గంలో ఆక్రమిత భూమిని వేరే వ్యక్తులకు అమ్మకానికి పెట్టడంతో ముస్లిం వర్గాలు భగ్గు మంటున్నాయి. శుభకార్యాలకు ఉపయోగపడే షాదీఖానా భూమిని అప్పనంగా కాజేసి అమ్మకానికి పెట్టడానికి యత్నాలు చేయడం వివాదాస్పదమైంది.

1999లో భూ కేటాయింపు...

లక్షకు పైగా జనాభా కలిగిన బెల్లంపల్లిలో ముస్లిం వర్గాల కోసం షాదీఖానా ఏర్పాటుకు అంకురార్పణ జరిగింది. ముస్లిం పెద్దల వినతి మేరకు మున్సిపాలిటీలోని షంషీర్‌నగర్‌లో 1999 సంవత్సరంలో భూ కేటాయింపులు జరిగాయి. బుధాకలాన్ పరిధి సర్వే నంబర్ 170లో రెండెకరాల ప్రభుత్వ భూమిని షాదీఖానాకు మంజూరు చేస్తూ రెవెన్యూ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఆ తర్వాత అప్పటి తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో షాదీఖానా నిర్మాణానికి రూ.7.50లక్షల నిధులు మంజూరు అయ్యాయి. తొలి విడతగా రూ.5లక్షలు కేటాయించడంతో షాదీఖానా నిర్మాణ పనులను ప్రారంభించారు. తదనంతరం నిధుల కేటాయింపు నిలిచిపోవడంతో షాదీఖానా పనులు అర్ధంతరంగా ఆగిపోయాయి. కొన్నాళ్ల పాటు భవన నిర్మాణ పనులు పునఃప్రారంభం కాకుండా పోవడం, ఆ స్థలంలో పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగి పడావుగా ఉండటంతో అక్రమార్కుల కన్ను షాదీఖానా భూమిపై పడింది. క్రమంగా కొందరు భూ ఆక్రమణల పర్వానికి శ్రీకారం చుట్టడంతో అర ఎకరానికి పైగా భూమి దురాక్రమణ జరిగినట్లుగా ముస్లిం వర్గాలు పేర్కొంటున్నాయి.

అక్రమ కట్టడాలు.. ఇంటి నంబర్లు ...!

ఆక్రమిత షాదీఖానా భూమిలో అక్రమార్కులు క్రమంగా శాశ్వత కట్టడాల నిర్మాణాలు కొన్నింటిని చేపట్టినట్లు ఓ వర్గం నాయకులు ఆరోపిస్తున్నారు. షెడ్లను నిర్మించి చేసి దొడ్డి దారిన మున్సిపాలిటీ నుంచి ఇంటి నంబర్‌లు తీసుకున్నట్లు తెలుస్తోంది.

ప్రభుత్వ భూమికి రిజిస్ట్రేషన్..!

నిబంధనల ప్రకారం ప్రభుత్వ భూమిని రిజిస్ట్రేషన్ చేయరాదు. కానీ షాదీఖానాకు సంబంధించిన ఆక్రమిత భూమికి తప్పుడు మార్గంలో రిజిస్ట్రేషన్ చేయించుకున్నట్లుగా ముస్లిం వర్గాలు పేర్కొంటున్నాయి. మున్సిపాలిటీ నుంచి తీసుకున్న ఇంటి నంబర్, తప్పుడు దస్త్రాల సాయంతో భూ రిజిస్ట్రేషన్ చేయించుకుని ఆక్రమిత భూమిని అమ్మకానికి పెట్టడం అంతా చట్ట విరుద్ధంగానే జరిగినట్లుగా తెలుస్తోంది. రూ.అరకోటికి పైగా ధర నిర్ణయించి విక్రయించడం చర్చనీయాంశమైంది. ఈ వ్యవహారంలో కొందరు మున్సిపల్ అధికారుల హస్తం ఉన్నట్లు విమర్శలు వస్తున్నాయి. రెవెన్యూ అధికారులు స్పందించి షాదీఖానా భూమిని కబ్జాదారుల చెర నుంచి విడిపించాలని ముస్లింలు ముక్త కంఠంతో కోరుతున్నారు.

స్వాధీనం చేసుకోవాలి



షాదీఖానా భూమిని కొందరు వక్రమార్గాన కబ్జా చేసి మున్సిపాలిటీ నుంచి ఇంటి నంబర్లు తీసుకున్నారు. వాస్తవానికి ఆ ఇళ్లను పరిశీలించకుండానే ముడుపులు తీసుకుని నంబర్లు కేటాయించినట్లుగా అనుమానాలు కలుగుతున్నాయి. దురాక్రమణకు గురైన షాదీఖానా భూమిని స్వాధీనం చేసుకుని కంచె ఏర్పాటు చేయాలి.

– అమానుల్లాఖాన్, ముస్లిం నాయకుడు

నోటీసులు అందజేస్తాం

షాదీఖానా భూ వివాదంపై కొందరు కోర్టును ఆశ్రయించారు. విచారణ చేసిన న్యాయస్థానం తగిన మార్గ దర్శకాలను జారీ చేసింది. కోర్టు ఉత్తర్వుల ప్రకారంగా కబ్జాదారులకు ముందస్తుగా నోటీసులు అందజేసి వివరణ కోరుతాం. ఆ తర్వాత కూల్చివేత చర్యలకు ఉపక్రమిస్తాం. ఏదైనా సరే చట్టపరంగా, కోర్టు ఆదేశాలకు అనుగుణంగా వ్యవహరిస్తాం.

– హరికృష్ణ, ఆర్డీవో, బెల్లంపల్లి

కార్మికుల పని సమయాన్ని తగ్గించాలి



మున్సిపల్ చైర్మన్‌కు వినతిపత్రం ఇస్తున్న కార్మికులు

మంచిర్యాలటౌన్: ఎండ తీవ్రత దృష్ట్యా మంచిర్యాల మున్సిపాలిటీలో పారిశుధ్యం, నీటి విభాగం, ఎలక్ట్రీషియన్ కార్మికుల పని సమయాన్ని ఒక గంట తగ్గించాలని కోరుతూ కార్మికులు బుధవారం మున్సిపల్ చైర్మన్ రావుల ఉప్పలయ్యకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతూ.. ఎండ వేడికి కార్మికులు డీహైడ్రేషన్‌కు గురయ్యే అవకాశం ఉందని, ఓఆర్ఎస్, మంచినీరు, మజ్జిగ ప్యాకెట్లు అందించాలని కోరారు. కార్మికుల ఆరోగ్య రక్షణకు తగిన చర్యలను తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో తెలంగాణ మున్సిపాలిటీ కాంట్రాక్టు కార్మిక సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు డి. సత్యం, జిల్లా ప్రధాన కార్యదర్శి ఏ.గోపాల్, ఈ.సదయ్య, ఆర్.రాజయ్య, ఎం.సత్యనారాయణ, ఎం.శ్రీనివాస్, ఏ.నర్సయ్య, సిహెచ్.శేఖర్, దుర్గయ్య పాల్గొన్నారు.

విద్యార్థులు ఒత్తిడికి లోనుకావొద్దు

- డీఈవో యాదయ్య



విద్యార్థినికి బహుమతి ఇస్తున్న డీఈవో

నస్పూర్: త్వరలో ప్రారంభం కానున్న పదో తరగతి పరీక్షలకు విద్యార్థులు ఎలాంటి మానసిక ఒత్తిడి లేకుండా హాజరుకావాలని డీఈవో యాదయ్య సూచించారు. ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో రేడియెంట్ హై స్కూల్‌లో నిర్వహించిన పదో తరగతి టాలెంట్ టెస్ట్‌లో రాణించిన విద్యార్థులకు డీఈవో యాదయ్య హాజరై బుధవారం బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... విద్యార్థులకు ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఇలాంటి టాలెంట్ పరీక్షలు నిర్వహించడం అభినందనీయమని పేర్కొన్నారు. విద్యార్థుల భవిష్యత్‌కు పదో తరగతి పరీక్షలు తొలిమెట్టు అని అన్నారు. విద్యార్థులు చదువులలో రాణిస్తే భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్, ఎస్సై జితేందర్‌సింగ్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు దాగం శ్రీకాంత్, మిట్టపల్లి తిరుపతి, మండల ఉపాధ్యక్షుడు ఎలుక అరవిందరెడ్డి, నాయకులు రాము, రమేశ్, విగ్నేశ్, మల్లేశ్, తదితరులు పాల్గొన్నారు.

మురుగునీరు తొలగింపు..!

సాక్షి ఎఫెక్ట్..



మురుగునీటిని తొలగిస్తున్న పంచాయతీ వర్కర్లు

కోటపల్లి: మండలంలోని నాగంపేట గ్రామంలో రోడ్లపై మురుగునీరు పారుతుండడంతో 'సాక్షి' దినపత్రికలో 'రోడ్లపై పారుతున్న మురుగునీరు' అనే శీర్షికన కథనం ప్రచురితం కాగా అధికారులు స్పందించారు. ప్రత్యేకాధికారి రవి, కార్యదర్శి తిరుపతి గ్రామపంచాయతీ సిబ్బందితో మురుగునీరు తొలగింపజేసి శాశ్వత పరిష్కారం దిశగా చర్యలు తీసుకున్నట్లు అధికారులు తెలిపారు. సమస్య పరిష్కారానికి కృషి చేసిన 'సాక్షి'కి కృతజ్ఞతలు తెలిపారు.

పౌష్టికాహారంపై అవగాహన

- కొనసాగుతున్న పోషణ పక్వాడ కార్యక్రమం



జిల్లా కేంద్రంలో చిన్నారులతో అంగన్‌వాడీ టీచర్



ప్రతిజ్ఞ చేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు



తాండూర్: అవగాహన కల్పిస్తున్న సీడీపీవో ఉమాదేవి

బెల్లంపల్లిరూరల్: బెల్లంపల్లి మండలంలోని రంగపేట అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం పోషణ పక్షోత్సవాల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జ్యోతి చిన్నారుల తల్లులకు ఆరోగ్యవంతమైన పోషకాహారం తీసుకోవడంపై అవగాహన కల్పించారు. ఆరు నెలలు నిండిన పిల్లలకు తప్పనిసరిగా పౌష్టికాహారాన్ని అందించాలని తల్లులకు సూచించారు. గర్భిణీ స్త్రీలు తీసుకోవాల్సిన పోషకాహారం, జాగ్రత్తల గురించి వివరించారు. చిరుధాన్యాల ప్రాముఖ్యతను వివరించారు. చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపి సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ మంగావతి, చిన్నారుల తల్లులు, చిన్నారులు పాల్గొన్నారు.

తాండూర్: చిన్నారులకు అందించే పౌష్టికాహారంపై చిన్నారుల తల్లులు అవగాహన పెంపొందించుకోవాలని బెల్లంపల్లి సీడీపీవో ఉమాదేవి పేర్కొన్నారు. మండలంలోని రేపల్లెవాడ, చౌటపల్లి అంగన్‌వాడీ కేంద్రాల్లో బుధవారం నిర్వహించిన పోషణ పక్వాడ కార్యక్రమానికి ఆమె హాజరయ్యారు. ఈ సందర్భంగా మంచి పోషక విలువలు కలిగిన ఆహారం, చిరుధాన్యాలపై చిన్నారుల తల్లులకు అవగాహన కల్పించారు. ఆరు నెలలు నిండిన పిల్లలకు అదనపు పౌష్టికాహారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మమత, అంగన్‌వాడీ టీచర్లు శారద, సక్కుబాయి తదితరులు పాల్గొన్నారు.

మంచిర్యాలటౌన్: జిల్లా కేంద్రంలోని పలు అంగన్‌వాడీ కేంద్రాలలో పోషణ పక్షం కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులకు చేతులను శుభ్రం చేసుకోవడం, చిరుధాన్యాలను తినడం వల్ల కలిగే లాభాలను వివరించారు. పౌష్టికాహారంపై అవగాహన కల్పించి, పరిసరాల పరిశుభ్రతను వివరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ బి.విజయలక్ష్మి, ఆయా మంజుల, ఏఎన్ఎం స్వప్న, తల్లులు, గర్భిణులు పాల్గొన్నారు.

భీమిని: మండలంలోని మామిడిగూడ గ్రామంలో బుధవారం పోషణ పక్వాడ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమాదేవి ఆధ్వర్యంలో విద్యార్థులకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాస్, ఏఎన్ఎం రేణుక, అంగన్‌వాడీ టీచర్ మహేశ్వరి, ఆయా లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

వయస్సుకు తగ్గ బరువు ఉండేలా చూడాలి

దండేపల్లి: అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే పిల్లలు వయస్సుకు, ఎత్తుకు తగ్గ బరువు ఉండేలా చూడాలని, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వాణి అంగన్‌వాడీ టీచర్లకు సూచించారు. దండేపల్లి మండలంలోని గూడెం సెక్టార్ పరిధిలోని ధర్మరావుపేట అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం పోషణ పక్షం కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం గర్భిణులకు సీమంతాలు, చిన్నారులకు అక్షరాభ్యాసం, అన్నప్రాసన చేయించారు. పోషణ్ అభియాన్ బ్లాక్ కోఆర్డినేటర్ లక్ష్మి, గూడెం సెక్టార్ పరిధిలోని అంగన్‌వాడీ టీచర్లు, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.



దండేపల్లి: పెద్దపేటలో గర్భిణులకు సీమంతాలు



అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ జ్యోతి

సాదాసీదాగా మున్సిపల్ కౌన్సిల్ సమావేశం



సమావేశంలో పాల్గొన్న మున్సిపల్ చైర్మన్ వేణు, కమిషనర్ సతీశ్, వైస్ చైర్‌పర్సన్ రజిత

నస్పూర్: మున్సిపల్ సాధారణ కౌన్సిల్ సమావేశం సాదాసీదాగా జరిగింది. మున్సిపల్ కార్యాలయంలో బుధవారం చైర్మన్ సురిమిల్ల వేణు, కమిషనర్ సీహెచ్ సతీష్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో పట్టణాభివృద్ధికై ఎజెండాలో పొందుపర్చిన 73అంశాలను కౌన్సిల్ సభ్యులు చర్చించి వాటిని ఏకగ్రీవంగా ఆమోదించారు. ఈ సమావేశంలో వైస్ చైర్‌పర్సన్ గెల్లు రజిత, ఆర్ఓ కే.సతీష్, ఇంజనీర్ డి.మధు, టీపీఎస్ ఆర్.సతీశ్, పలువురు కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

పల్లెప్రకృతి వనాలు అలంకారప్రాయం..!

- అడవులను తలపిస్తూ అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిన వైనం
- పట్టించుకోని అధికార ఘనం



ఆనవాళ్లే కనిపించకుండా కిష్టంపేట పల్లె ప్రకృతివనం



అడవిలా మారిన నీలాయపల్లి పల్లె ప్రకృతివనం

తాండూర్: గ్రామీణ ప్రాంత వాసులకు ఆహ్లాదాన్ని పంచేందుకు ఏర్పాటు చేసిన పల్లెప్రకృతి వనాలు లక్ష్యానికి దూరమయ్యాయి. పల్లె వాసులు అప్పుడప్పుడు సేదతీరేందుకు అన్ని రకాల వసతులతో నిర్మించిన పల్లె ప్రకృతి వనాలు నేడు అడవులను తలపిస్తున్నాయి. నిర్వహణ లేక నిరుపయోగంగా మారి అధికార యంత్రాంగం పనితీరును వెక్కిరిస్తున్నాయి. బెల్లంపల్లి నియోజకవర్గవ్యాప్తంగా ఒకటి, రెండు చోట్ల మినహా ఏ ఒక్క చోట కూడా పల్లెప్రకృతి వనాలు స్థానికులు ఉపయోగించేందుకు వీలు లేకుండా అధ్వానంగా తయారయ్యాయి.

రూ.లక్షల్లో నిధులు వృథా....

ప్రభుత్వం ప్రతి గ్రామ పంచాయతీకో పల్లెప్రకృతి వనాన్ని మంజూరు చేసింది. ఒక్కో పల్లెప్రకృతి వనాన్ని రూ.2 నుంచి 3లక్షల అంచనాతో నిర్మించారు. జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం నిధులతో వీటి నిర్మాణం చేపట్టారు. నియోజకవర్గ వ్యాప్తంగా 117పల్లె ప్రకృతి వనాలను పూర్తి చేశారు. దీంతో పాటు ఒక్కో మండలానికి నాలుగు చొప్పున బృహత్ పల్లె ప్రకృతి వనాల ఏర్పాటుకు రూ.9లక్షల నుంచి రూ.14లక్షల వరకు వ్యయం చేశారు.

నిర్వహణ కొరవడి...

కొన్నిచోట్ల మొక్కలు నాటకుండా అసంపూర్తిగా ఉండగా, నిర్మాణం పూర్తి చేసుకున్న పల్లె ప్రకృతి వనాలకు 2020సంవత్సరం నుంచి మూడు సంవత్సరాల పాటు ఉపాధిహామీ కూలీలు అంతంతమాత్రంగా పనులు చేశారు. గడువు ముగియడంతో ఆ బాధ్యత గ్రామ పంచాయతీల పై పడింది. కానీ గ్రామ పంచాయతీ అధికారులు పల్లెప్రకృతి వనాల నిర్వాహణను గాలికి వదిలేసారని విమర్శలు ఉన్నాయి. కిష్టంపేట పల్లె ప్రకృతి వనం జాతీయ రహదారి కంటే కిందికి ఉండడంతో అందులోకి అడుగు పెట్టేందుకు కూడా వీలు లేకుండా తయారైంది. కాసిపేట, గోపాల్‌నగర్ పల్లె ప్రకృతి వనాలు ఊరికి మూడు కిలో మీటర్ల దూరంలో ఏర్పాటు చేయడంతో వాటిని ప్రజలు వినియోగించక అవి ఆనవాళ్లు కోల్పోయాయి. ఇలా నిర్వాహణ లేక చాలా చోట్ల మొక్కలు ఎండిపోయి, మరికొన్ని చోట్ల చిత్తడిగా మారాయి. అనేక చోట్ల పల్లెప్రకృతి వనాలు ఆనవాళ్లను కోల్పోయి దర్శనమిస్తున్నాయి. ప్రభుత్వ లక్ష్యానికి భిన్నంగా పల్లె ప్రకృతి వనాలు అలంకారప్రాయంగా మారాయి. నియోజకవర్గ పరిధిలోని తాండూర్, కాసిపేట, భీమిని, కన్నెపల్లి, వేమనపల్లి, నెన్నెల, బెల్లంపల్లి మండలాల్లో పల్లెప్రకృతి వనాల పరిస్థితి ప్రభుత్వ అధికారుల నిర్లక్ష్యానికి నిలువుటద్దంగా నిలుస్తున్నాయి.

నిర్వహణ పనులు చేపిస్తున్నాం

పల్లె ప్రకృతి వనాల్లో ఎప్పటికప్పుడు నిర్వహణ పనులు చేయిస్తూ, చెత్తను తొలిగింపజేస్తున్నాం. ఊరికి అందుబాటులో ఉన్న వాటిని స్థానికులు వినియోగిస్తున్నారు. ఊరికి దూరంగా ఉన్నవి నిరుపయోగంగా మారాయి. వాటిని కూడా అందరూ వినియోగించుకునేలా చర్యలు తీసుకుంటాం.

– సత్యనారాయణ రెడ్డి, ఎంపీవో, తాండూర్

అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాలుగా...

నిరుపయోగంగా మారిన పల్లెప్రకృతి వనాలు అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాలుగా మారుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మందుబాబులు వీటిని అడ్డాలుగా చేసుకుని ఇష్టారీతిన వ్యవహరించడం విమర్శలకు తావిస్తోంది. కొన్ని చోట్ల అధికారుల దృష్టికి మందుబాబుల ఆగడాలు రావడంతో పల్లెప్రకృతి వనాలకు శాశ్వతంగా తాళాలు వేశారు. దీంతో పల్లెప్రకృతి వనాలు ఉన్నాయన్న విషయాన్ని ప్రజలు మరిచిపోయి, ఆ పక్కన కన్నెత్తి చూడడమే మానేశారు.

సంక్షిప్త వార్తలు

సేఫ్టీ జీఎంకు సన్మానం

శ్రీరాంపూర్: బెల్లంపల్లి రీజియన్ సేఫ్టీ జనరల్ మేనేజర్‌గా పనిచేసి రామగుండం రీజియన్‌కు బదిలీపై వెళ్తున్న కేహెచ్ఎన్ గుప్తాను ఎస్సార్పీ 3, 3ఏ గని అధికారులు ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. గనిపై బుధవారం జరిగిన కార్యక్రమంలో గ్రూప్ ఏజెంట్ గోపాల్ సింగ్, మేనేజర్ సంతోష్ కుమార్‌లు ఆయనను శాలువాతో సత్కరించి ఆయన సేఫ్టీ లో చేసిన సేవలను కొనియాడారు. బదిలీ అయిన రీజియన్‌లో కూడా మంచిగా రాణించి పేరు ప్రఖ్యాతలు సాధించాలన్నారు. కార్యక్రమంలో ఏరియా రక్షణ అధికారి శ్రీధర్ రావు, గని అధికారులు ప్రేమ్ కుమార్, సాయి గౌస్‌పాషా, శ్రీనివాస్ పాల్గొన్నారు.

పీఆర్టీయూ సభ్యత్వ నమోదు

లక్సెట్టిపేట: పీఆర్టీయూ తెలంగాణ ఉపాధ్యాయ సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని మండలంలోని ఉపాధ్యాయ సంఘాల నాయకులు బుధవారం స్థానిక బాలుర పాఠశాల, జెండా వెంకటాపూర్, తిమ్మాపూర్ పాఠశాలలోని ఉపాధ్యాయులతో సభ్యత్వ నమోదును స్వీకరించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు వేణుగోపాల్, కార్యదర్శి గంగాధర్, శైలజ, రవికాంత్, కొత్త సురేష్, భైరి రామన్న, రామ్మోహన్ రెడ్డి పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ ప్రారంభం

చెన్నూర్: చెన్నూర్ పట్టణంలో ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయాన్ని చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి గురువారం ఉదయం 10:30గంటలకు ప్రారంభించనున్నారు. ప్రారంభోత్సవానికి ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని కోరారు.

ఆరోగ్య సమస్యలపై అవగాహన

మంచిర్యాలఅర్బన్: రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో శ్రీ చైతన్య పాఠశాలలో ఆరోగ్య సమస్యలపై అవగాహన కల్పించారు. పాఠశాల పరిశుభ్రతపై వివరించారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సొసైటీ కార్యదర్శి మహేందర్, వైద్యురాలు దివ్య, పాఠశాల ప్రిన్సిపాల్ జోబిన్ తదితరులు పాల్గొన్నారు.

త్వరలోనే నిందితులను పట్టుకుంటాం

చెన్నూర్: పట్టణంలో గత రెండు రోజుల క్రితం ఓ పత్రిక విలేకరి వెంకటరాజుపై దాడి చేసిన నిందితులను త్వరలోనే పట్టుకుంటామని సీఐ రవీందర్ తెలిపారు. బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ మాట్లాడారు. సాంకేతిక పరిజ్ఞానంతో దాడికి పాల్పడిన అనుమానిత నిందితులను గుర్తించినట్లు తెలిపారు. వారిని పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి దర్యాప్తు వేగవంతం చేశామన్నారు. నిందితులు ఎంతటి వారైన వదిలిపెట్టేది లేదన్నారు.

నూతన కార్యవర్గం

జన్నారం: మండలంలోని కవ్వాల్ గ్రామ తెలంగాణ గల్ఫ్ కార్మికుల సంక్షేమ సమితి కార్యవర్గాన్ని నియామకం చేసినట్లు ఆ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ తిరుపతిగౌడ్ బుధవారం తెలిపారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

తాండూర్: మండలంలోని కాసిపేట గ్రామంలో నూతనంగా చేపట్టే సీసీ రోడ్ల పనులను ఎంపీపీ పూసాల ప్రణయ్ కుమార్, మాజీ సర్పంచ్ అస్స రమేష్ బుధవారం ప్రారంభించారు. నాయకులు గోపి, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ రజిత సేవలు చిరస్మరణీయం

తాండూర్: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో విధులు నిర్వర్తించిన డాక్టర్ రజిత అందించిన సేవలు చిరస్మరణీయమని సేవా జ్యోతి శరణాలయ నిర్వాహకులు గజ్జెల్లి శ్రీదేవి అన్నారు. రజిత జయంతిని పురస్కరించుకుని శరణాలయంలో ఆమె చిత్రపటం వద్ద నివాళులర్పించారు.

కవయిత్రి మొల్లమాంబ జయంతి

పాతమంచిర్యాల: తొలితెలుగు కవయిత్రి మొల్లమాంబ జయంతిని బుధవారం కుమ్మర సంఘం నాయకులు జిల్లా కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

సంబురాలు

మంచిర్యాలటౌన్: నిరుపేద ఆర్యవైశ్యుల ఉన్నతి కోసం సీఎం రేవంత్‌రెడ్డి ఆర్యవైశ్య కార్పొరేషన్‌ను ప్రకటించడంపై వాసవి క్లబ్‌ల ఆధ్వర్యంలో బుధవారం జిల్లా కేంద్రంలో టపాసులు కాల్చి, స్వీట్లు పంచుకుని సంబురాలను జరుపుకున్నారు.

పాతమంచిర్యాల: రాష్ట్ర ప్రభుత్వం మున్నూరు కాపు కార్పొరేషన్ ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించడంపై జిల్లా కేంద్రంలో మున్నూరు కాపు సంఘం నాయకులు మిఠాయిలు పంపిణీ చేసి సంబురాలు చేసుకున్నారు.

సన్మానం

మంచిర్యాలటౌన్: నేషనల్ ల్యాబ్ టెక్నీషియన్స్ డే సందర్భంగా రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో బ్లడ్ బ్యాంకు ప్రాంగణంలో మాధవి, విజయ్, రవివర్మ, శ్రీనివాస్, సాయిలక్ష్మి, వేణు, ప్రణయ్, శైలజ, రాజకుమార్‌ల ను బుధవారం ఘనంగా సన్మానించారు.